క్లుప్తంగా

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని బుధవారం కర్ణాటక మంత్రి ఆర్బి తిమ్మాపూర్, తెలంగాణ ఎమ్మెల్సీ ఎమ్మెస్ ప్రభాకర్ రావు దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు లడ్డూ, ప్రసాదాలతో సత్కరించారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



నూతన వరుడి కుటుంబ సభ్యులకు పెళ్లి కానుక అందజేస్తున్న నాయకులు

చంద్రగిరి: మండలంలోని దోర్నకంబాల పంచాయతీ మల్లయ్యపల్లికి చెందిన మునిశేఖర్, దివ్యశ్రీకి వివాహం నిశ్చయమైంది. వారికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను బుధవారం వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుసుమ కుమారి, ఉప సర్పంచ్ మురళీ రెడ్డి, నాయకులు ప్రతాప్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, నాదముని యాదవ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు..

ఐతేపల్లిలో ఏటీఎం ప్రారంభం

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లెలో బుధవారం ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించారు. గతంలో నగదు కోసం ఐతేపల్లె చుట్టుపక్కల సుమారు 30 గ్రామాల ప్రజలు సుమారు 10 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సివచ్చేది. ఐతేపల్లెలో ఏటీఎం ప్రారంభించడంతో సౌకర్యంగా ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐతేపల్లెలో ఏర్పాటుచేసిన ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు పులిపాటి హేమాద్రి తెలిపారు.

దర్శన్ సిల్క్స్ షోరూం ప్రారంభం



కొనుగోలుదారులకు బహుమతులందజేస్తున్న షోరూం అధినేత జానకి రమణారెడ్డి

తిరుపతి కల్చరల్: యాదవవీధిలో ఏర్పాటు చేసిన దర్శన్ సిల్క్స్ షోరూంను బుధవారం షోరూం అధినేత జానకి రమణారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ షోరూం ప్రారంభం సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. మొదటి మూడు రోజులు బిల్ టూ బిల్ కూపన్స్, ప్రతి రూ.2500, రూ.5 వేల కొనుగోలు చేసిన వారికి ప్రత్యేక బహుమతి అందజేస్తామని తెలిపారు. అలాగే ప్రతి రూ.10 వేలు కొనుగోలు చేసిన వారికి 10 గ్రాముల వెండి నాణెం ఉచితంగా అందిస్తామన్నారు. అంతేకాక దీపావళి సందర్భంగా ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజారెడ్డి, వినిత రెడ్డి, ధనుషరెడ్డి, మౌనికరెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు అభినందన

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి రెండు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని పలువురు సాహితీవేత్తలు, రచయితలు అభినందించారు. తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా భూమి పూజ చేసిన ఆయనను వారు కలిశారు. సాకం నాగరాజు, తమటం రామచంద్రారెడ్డి, బొందు రామచంద్రారెడ్డి, వాకా ప్రసాద్, డాక్టర్ డి.మస్తానమ్మ పాల్గొన్నారు.

టేబుల్ 9 రెస్టారెంట్ ప్రారంభం



డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని సత్కరిస్తున్న వైష్ణవ్, చరణ్

తిరుపతి కల్చరల్: కరకంబాడి రోడ్డులోని డీమార్ట్ సమీపంలో ఏర్పాటు చేసిన టేబుల్ 9 రెస్టారెంట్ మూడో బ్రాంచ్‌ను బుధవారం తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలు అందజేయాలని ఆకాంక్షించారు. టేబుల్ 9 రెస్టారెంట్ అధినేత తిరునగరి వైష్ణవ్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్, కపిల తీర్థం రోడ్డు ప్రాంతాల్లో ఇప్పటికే నడుస్తున్న టేబుల్ 9 రెస్టారెంట్‌ను ఆదరిస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల కోరికమేరకు కరకంబాడి రోడ్డులో మూడో బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో టేబుల్ 9 రెస్టారెంట్ తిరునగరి చరణ్, తిరుపతి హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిల్లీస్ అంజి, కార్పొరేటర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

జగనన్నతోనే బలహీన వర్గాల అభ్యున్నతి





మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి

- రేపటి నుంచి తిరుపతిలో సామాజిక, సాధికార యాత్ర
- పద్మావతిపురంలో సన్నాహక సమావేశం
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపు

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమైందని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. తిరుపతిలో శుక్రవారం చేపట్టనున్న సామాజిక సాధికార యాత్ర సందర్భంగా తిరుపతి పద్మావతి పురంలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజికవర్గ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ రాజకీయ చరిత్రలో ఏ నాయకుడూ చేయలేని విధంగా రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. జగనన్న పాలనలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందారని వివరించారు. తిరుపతిలో శుక్రవారం నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జగనన్న చేసిన మేలు మరువలేం...

అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకుడు వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, బలిజ జేఏసీ నాయకులు నీలం బాలాజి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సఫీ అహ్మద్‌ఖాద్రి, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు తెలిపారు. జగనన్న లాంటి గొప్ప నాయకుడు అధికారంలో ఉంటేనే బడుగులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని వివరించారు. సమావేశంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అనుబంధ సంస్థల చైర్మన్లు, అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక, సాధికార యాత్ర సాగే ప్రాంతాలు

సామాజిక, సాధికార యాత్ర శుక్రవారం తిరుపతి బాలాజీకాలనీలోని జ్యోతిరావ్‌పూలే విగ్రహం నుంచి ప్రారంభమవుతుంది. టౌన్ క్లబ్ సర్కిల్, క్రైం పోలీసే స్టేషన్ ఎదురుగానున్న మంచినీళ్ల గుంట మార్గం నుంచి ఐఎస్ మహల్, జ్యోతి థియేటర్, రుయా ఆసుపత్రి, చెన్నారెడ్డికాలనీ, సెట్విన్ ఆఫీస్, ఓల్డ్ మెటర్నటీ ఆసుపత్రి, భవానీనగర్, వీవీమహల్ రోడ్డు, పాత మున్సిపల్ కార్యాలయం, దేవేంద్ర థియేటర్, లీలామహల్ సర్కిల్, మున్సిపల్ పార్కు వరకు సాగుతుంది. అక్కడి నుంచి అన్నారావ్ సర్కిల్, కపిలి తీర్థం నుంచి తిరుమల బైపాస్ రోడ్డు గుండా శివజ్యోతినగర్, సత్యనారాయణపురం, జీవకోన, రాజీవ్‌గాంధీకాలనీ, మాధవనగర్ నుంచి మంగళం రోడ్డు గుండా లీలామహల్ సర్కిల్, కొర్లగుంట ఆర్టీసీ బస్టాండ్ మీదుగా బ్లిస్ సర్కిల్, లక్ష్మీపురం సర్కిల్ మీదుగా ఎయిర్‌బైపాస్ రోడ్డు, ఈఎస్ఐ ఆసుపత్రి, ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ మీదుగా వైకుంఠపురం ఆర్చి, ఎంఆర్‌పల్లి సర్కిల్, అన్నమయ్య సర్కిల్, రాయల్‌నగర్, భేరివీధి, కృష్ణాపురం ఠాణా, గాంధీరోడ్డు మీదుగా తిలక్‌రోడ్డు, సెంట్రల్ పార్కు, కూరగాయల మార్కెట్, తాతయ్యగుంట గంగమ్మ ఆలయం మీదుగా సాగుతుంది.

త్వరలో మాస్టర్ ప్లాన్ రోడ్లు ప్రారంభం



మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: రోడ్లతోనే తిరుపతి నగర విస్తరణ సాధ్యమని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె బుధవారం హీరో హోండా షోరూం- పద్మావతిపురం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు పూర్తయిన అంకుర, హీరో హోండా షోరూం మాస్టర్ రోడ్ల బ్యూటిఫికేషన్‌పై పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ త్వరలో ఈ రెండు రోడ్లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. సరైన రోడ్ల వ్యవస్థ లేకపోవడంతోనే తిరుపతి విస్తరించలేదన్నారు. ఈ విషయాన్ని గుర్తించే 18 మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి పూనుకున్నట్టు చెప్పారు. దీంతో 5 ఎకరాల్లో తిరుపతి విస్తరించనుందని, తద్వారా కార్పొరేషన్‌కు ఎక్కువ ఆదాయ వనరులు సమకూరుతాయన్నారు. ఎస్‌ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణకు శ్రీకారం

- భూమి పూజ చేసిన టీటీడీ చైర్మన్ భూమన

తిరుపతి కల్చరల్: ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులకు బుధవారం టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి భూమి పూజ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ, పెద్ద గంగమ్మ, వేశాలమ్మ ఆలయాలల్లో ఒకే సారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి ఆలయాల చరిత్ర నిలిచిపోయేలా జీర్ణోద్ధరణ చేపట్టి భావితరాలకు చెరుగని జ్ఞాపకంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే శిథిలావస్థకు చేరుకున్న పెద్ద గంగమ్మ ఆలయాన్ని టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.85 లక్షలతో జీర్ణోద్ధరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ శిరీష, గ్రూప్ ఆలయాల ఈవో మమత, తాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయ చైర్మన్ సద్దా బాబు యాదవ్, పాలక మండలి సభ్యులు సూర్యప్రకాష్, శారదమ్మ, రేవతి, కామాక్షాయణి, లతమ్మ, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, సభ్యులు క్రిష్ణమ్మ, అంకాళమ్మ ఆలయ చైర్మన్ లక్ష్మయ్య, కల్యాణ వెంటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, మేయర్ శిరీష, ఆలయాల కమిటీ చైర్మన్లు

నేటి నుంచి కార్గో వారోత్సవాలు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో గురువారం నుంచి నవంబర్ 25వ తేదీ వరకు ఆర్టీసీ కార్గో వారోత్సవాలు నిర్వహించనున్నట్లు డెప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కార్గో వారోత్సవాల్లో డోర్ డెలివరీపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 2017 నుంచి కార్గో సేవలు ప్రారంభించామని, రూ.10 కోట్ల రాబడి మొదలైందన్నారు. నేడు రాష్ట్ర వ్యాప్తంగా రూ.169 కోట్ల రాబడి వస్తుందని తెలిపారు. 2021 సెప్టెంబర్ 1 నుంచి డోర్ డెలివరీ చేస్తున్నట్టు చెప్పారు. కార్గో సెంటర్ నుంచి 10 కిలోమీటర్ల వరకు ప్రస్తుతం డోర్‌డెలివరీ చేస్తున్నట్లు చెప్పారు. కార్గో చార్జీలతోపాటు అదనంగా కేజీకి రూ.15, 1-6 కేజీలకు రూ.25, 6-10 కేజీలకు రూ.30, 10-25 కేజీలకు రూ.40, 25-50 కేజీలకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, కార్గో జిల్లా ఇన్‌చార్జి సురేంద్రబాబు పాల్గొన్నారు.

భూమన కుటుంబానికి రుణపడి ఉంటాం



ఎమ్మెల్యే భూమనను సత్కరిస్తున్న సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాద్రి, ముస్లిం మత పెద్దలు

తిరుపతి మంగళం: ముస్లింలకు ఉన్నత పదవులు కల్పించిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటామని ముస్లిం మతపెద్దలు తెలిపారు. వక్ఫ్‌బోర్డ్ డైరెక్టర్‌గా నియమితులైన సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాద్రి బుధవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని పద్మావతిపురంలోని ఆయన నివాసంలో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పొన్నాల చంద్ర, షేక్ ఫరీద్‌సాహెబ్, షేక్ ఇస్మాయిల్, షేక్ చాంద్‌బాషా, ఇనాయతుల్లా, షాహిఅమీన్, షేక్ ఇర్మాడ్, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య, సాకం ప్రభాకర్, మాలిక్, ఇబ్రహీం పాల్గొన్నారు.

తిరుచానూరు రైల్వే స్టేషన్ తనిఖీ



తిరుపతి తిరుచానూరు రైల్వే స్టేషన్ పనులను పరిశీలిస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, అధికారులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుపతి ఎంపీ గురుమూర్తి బుధవారం తిరుచానూరు రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైల్వే స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న మొదటి, రెండో ప్లాట్ ఫారాలను కలిపే అండర్ పాస్‌లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అండర్ పాస్‌లలో నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి ప్లాట్ ఫారంపై నిర్మిస్తున్న క్యాంటీన్, షెల్టర్‌ను పరిశీలించారు. నాణ్యత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి జనవరి నెలకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే అధికారులను కోరారు. ఈ రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే తిరుపతి ప్రధాన రైల్వే స్టేషన్‌పై భారం తగ్గుతుందని, తిరుమలకు విచ్చేసే యాత్రికులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అలాగే హీరో హోండా షోరూం, సీఆర్ఎస్ వద్ద నిర్మించతలపెట్టిన రైల్వే అండర్ బ్రిడ్జీల టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట దక్షిణ మధ్య రైల్వే అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్, సిబ్బంది పాల్గొన్నారు.

రచయిత నామినికి సత్కారం



తిరుపతి కల్చరల్: వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కార గ్రహీత, ప్రముఖ రచయిత నామిని సుబ్రమణ్యం నాయుడిని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఘనంగా సత్కరించి అభినందించారు. రచయిత నామిని బుధవారం పద్మావతిపురంలోని భూమన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.


తిరుపతి అభివృద్ధిలో వెనక్కి తగ్గేది లేదు



మాట్లాడుతున్న సీపీఎం నేత కందారపు మురళి

తిరుపతి కల్చరల్: తిరుపతి అభివృద్ధికి ఒక శాతం నిధులు కేటాయిస్తూ టీటీడీ పాలక మండలి తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ నేతలు అడ్డుకోవడం దుర్మార్గమని, తిరుపతి అభివృద్ధిపై వెనక్కి తగ్గేది లేదని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధుల కేటాయింపును అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బుధవారం తిరుపతి అభివృద్ధి వేదిక కన్వీనర్ టి.సుబ్రమణ్యం ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు టీటీడీ పరిపాలన భవనం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధికి ఒక శాతం నిధులు టీటీడీ కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడం సమంజసం కాదన్నారు. హిందూ వ్యతిరేకి అనే ముద్ర తనపై పడుతుందనే భయంతో కాకుండా తిరుపతి ప్రజల అభీష్టానికి అనుకూలంగా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.4,500 కోట్ల ఆదాయం ఉన్న టీటీడీకి ఒక శాతం నిధుల కేటాయింపు పెద్ద విషయం కాదని, దీనిని చట్టంగా మార్చడం ద్వారా భవిష్యత్తులో తిరుపతి అవసరాలు తీర్చుకోవడానికి తోడ్పడుతుందన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ వంటి సంస్థలు తిరుపతి అభివృద్ధికి అడ్డుపడుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. బాధ్యతా రాహిత్యంగా ప్రవర్తిస్తున్న బీజేపీ అవకాశవాదాన్ని, రెచ్చగొట్టే తీరును గమనించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీపీఎం నేతలు వందవాసి నాగరాజు, కందారపు మురళి, సీపీఐ నేత పి.మురళి, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత ఆర్.హరికృష్ణ, ఆర్‌పీఐ నేత పి.అంజయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ నేత వెంకటాచలపతి, బీఆర్ఎస్ నేత ఆర్కాట్ కృష్ణప్రసాద్, డీఎంసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన భూములు స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

తిరుపతి కల్చరల్: కల్కి భగవాన్ ఆశ్రమం పేరుతో వరదయ్యపాలెం వద్ద ఆక్రమించుకున్న మూడు ఎకరాల 74 సెంట్ల ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కల్కి భగవాన్ అని పిలవబడే విజయకుమార్ 20 ఏళ్ల క్రితం 3.47 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నా అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం ఆ భూమి రూ.కోట్ల విలువ చేస్తుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో హైకోర్టులో ఫిర్యాదు చేస్తామన్నారు.

స్విమ్స్‌లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు

తిరుపతి తుడా: స్విమ్స్ యూనివర్సిటీలో ఇటీవల ఉద్యోగ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ 100 శాతం అమలు చేశారని టీటీడీ, స్విమ్స్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు పరమశివన్, ఎం.ప్రసాదరావు, అమర్‌నాథ్ హర్షం వ్యక్తం చేశారు. వారు బుధవారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ పదోన్నతుల్లో రిజర్వేషన్‌ను పక్కాగా అమలు చేయాలని, బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. నాయకులు రామ్మూర్తి, కే.భూపాల్, గంగాధర్, బెనర్జీ, హరిప్రసాద్, సురేష్, మధుబాబు, ఓంకార మూర్తి, గిరిబాబు పాల్గొన్నారు.



స్విమ్స్ డైరెక్టర్‌ను కలిసిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని అమలుచేయాలి



మాట్లాడుతున్న కల్లూరి చెంగయ్య

తిరుపతి కల్చరల్: పేద పిల్లల విద్యాభివృద్ధి కోసం గతంలో మహానేత వైఎస్ఆర్ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బాస్) పథకాన్ని అమలుచేశారని, దాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేసి పేద విద్యార్థులను ఆదుకోవాలని ఐక్య దళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య కోరారు. ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిపై ఐక్య దళిత మహానాడు ఆధ్వర్యంలో బుధవారం ఎస్‌జీఎస్ హైస్కూల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని భావించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఉన్నత స్థానాల్లో ఉన్న వేలాది మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. గత ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు. తద్వారా పేద పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు టి.చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష





జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొన్న గ్రామస్తులు, వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

రామచంద్రాపురం: ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నెన్నూరులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధి తీవ్రతను గుర్తించి చికిత్స తీసుకోవచ్చని చెప్పారు. ఈ క్రమంలోనే గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జ్ఞానమ్మ, సర్పంచ్ అనసూయమ్మ, మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ నాణ్యమైన వైద్యం

చంద్రగిరి: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఆరోగ్య రక్షగా నిలుస్తోందని రాయలపురం సర్పంచ్ వెంకటయ్య తెలిపారు. మండలంలోని రాయలపురంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. వారికి సర్పంచ్ వెంకటయ్య మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో రమేష్ బాబు కార్యక్రమాన్ని పరిశీలించారు.

సుబ్రమణ్యస్వామి విగ్రహానికి విరాళం



విరాళం అందజేస్తున్న హరిప్రసాద్, స్వర్ణకుమారి దంపతులు



విరాళం అందజేస్తున్న వసంత

పాకాల: స్థానిక ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహానికి బుధవారం వైఎస్సార్ సీపీ మొగరాల డివిజన్ అధ్యక్షుడు మొగరాల హరిప్రసాద్‌రెడ్డి, స్వర్ణకుమారి దంపతులు రూ.51,116, సూరినేని వారిపల్లికి చెందిన పి.వసంత రూ.53,000 విరాళం ఇచ్చారు. వారికి ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి అభినందించి స్వామి వారి దర్శనం కల్పించారు. శివశంకర్‌రెడ్డి, సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చిల్లీస్ మూడో బ్రాంచ్ ప్రారంభం



చిల్లీస్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న మధుమోహన్‌రావు

తిరుపతి కల్చరల్: తిరుమల బైపాస్ రోడ్డులోని తిరుమల మ్యూజిక్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చిల్లీస్ రెస్టారెంట్ మూడో బ్రాంచిని ఘనంగా ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథులుగా చిల్లీస్ ఫౌండర్ మధుమోహన్‌రావు దంపతులు, సింధూరి పార్కు అధినేత వెంకయ్య, బ్లిస్ హోటల్ అధినేత బాలకృష్ణారెడ్డి, తిరుపతి ఈస్ట్ డీఎస్పీ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ చిల్లీస్ రెస్టారెంట్ అండ్ హోటల్స్ అధినేత వీరాంజనేయులును తిరుపతి జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆయన సేవా కార్యక్రమాలు చేపట్టడంతో పాటు హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ యజమానులు, ప్రతినిధులు, సిబ్బందికి సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. చిల్లీస్ అంజి మాట్లాడుతూ నగర ప్రజలకు కోరిక మేరకు కొర్లగుంటలో చిల్లీస్ బ్రాంచ్‌ని ప్రారంభించామని తెలిపారు. తిరుపతి జిల్లా హోటల్స్ రెస్టారెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి నితిన్ చక్రవర్తి, కోశాధికారి శ్రీహరి పాల్గొన్నారు.

పాడి రైతులకు దసరా బోనస్

పుత్తూరు రూరల్: జగనన్న పాల వెల్లువలో భాగంగా మహిళా పాడి రైతులకు దసరా పండుగ సందర్భంగా లీటరుపై 50 పైసల వంతున బోనస్ ఇచ్చినట్లు పుత్తూరు రూట్ ఆఫీసర్ కె.సునీల్‌దత్ బుధవారం తెలిపారు. బోనస్ మొత్తాన్ని ఏఎంసీయూల ద్వారా అమూల్ డెయిరీకి పాలు పోస్తున్న రైతుల డీసీసీ బ్యాంకు అకౌంట్‌లో జమ చేసినట్లు వెల్లడించారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి ఉత్సవం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. ఏకాదశి గడియల్లో అర్చన పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేతంగా స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. తదుపరి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణ చేశారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

